కనువిందు.. చేనేత హస్తకళ



ఏఎస్‌రావు నగర్ ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన చేనేత హస్తకళ ప్రదర్శన కనువిందు చేస్తోంది. రకరకాల ఫ్యాషన్ దుస్తులు, వస్తువులు ఒకే వేదికపై అందుబాటులో ఉండటంతో నగర ప్రజలను ఆకట్టుకుంటోంది. హ్యాండ్లూమ్స్ సిల్క్ ఎక్స్పో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ ఎగ్జిబిషన్‌లో చేనేత వస్త్రాలతోపాటు డిజైన్ ఖాదీ, పోచంపల్లి శారీస్, సల్వార్ సూట్స్, కశ్మీర్ శాల్స్, వన్‌గ్రామ్ గోల్డ్ జ్యువెలరీ, పెయింటింగ్స్, జూట్ బ్యాగ్స్ కొలువుదీరాయి. అక్టోబర్ 21 వరకు ఈ ఎగ్జిబిషన్ కొనసాగుతోందని నిర్వాహకులు తెలిపారు. – కాప్రా





మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట: మేయర్



శ్మశానవాటిక ప్రహరీ శంకుస్థాపనలో పాల్గొన్న మేయర్ అజయ్‌యాదవ్

బోడుప్పల్: కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీల సంక్షేమానికి పెద్దపీట వేస్తుందని బోడుప్పల్ మేయర్ తోటకూర అజయ్‌యాదవ్ అన్నారు. బోడుప్పల్ 8వ డివిజన్ పరిధిలో రూ 20 లక్షల వ్యయంతో సోమవారం ముస్లింల శ్మశానవాటిక ప్రహరీ నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. అన్నివర్గాల ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నామన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర హజ్ కమిటీ మెంబర్ ముజీబుద్దీన్, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్, కార్పొరేటర్లు సీసా వెంకటేశ్‌గౌడ్, చీరాల నర్సింహ్మా, నేతలు గుర్రాల వెంకటేశ్‌యాదవ్, మొహమ్మద్ మజార్, సయ్యద్ అజ్గర్, ఇస్మాయిల్ ఖాన్, మొహమ్మద్ ఇస్మాయిల్, యాకోబ్, గౌస్, ఆరిఫ్, అక్బర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రజావాణి ఫిర్యాదులను పరిష్కరిస్తాం...

నగర పాలక సంస్థ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో మేయర్ తోటకూర అజయ్‌యాదవ్, కమిషనర్ రామలింగం, డిప్యూటీ మేయర్ కొత్త స్రవంతి కిశోర్‌గౌడ్ పాల్గొన్నారు. మొత్తం మూడు దరఖాస్తులు రాగా వాటిని సత్వరం పరిష్కరిస్తామన్నారు.

నిమజ్జనానికి ఏర్పాట్లు సిద్ధం

- సఫిల్‌గూడ చెరువు వద్ద ప్రత్యేక పాండ్
- 90 ట్యాంకర్లతో నీటిని నింపుతున్న సిబ్బంది
- బండచెరువు వద్ద ఒక క్రేన్ రెడీ
- ఏడు అడుగుల విగ్రహాల నిమజ్జనానికే అనుమతి



సఫిల్‌గూడ నిమజ్జన ఘాట్



నిమజ్జనానికి సిద్ధమైన క్రేన్‌లు

మల్కాజిగిరి: మల్కాజిగిరి సర్కిల్ పరిధిలోని సఫిల్‌గూడ, బండచెరువు వద్ద వినాయక విగ్రహాల నిమజ్జనం సోమవారం ప్రారంభమైంది. ఈ చెరువుల వద్ద సుమారు రూ.52 లక్షలతో నిమజ్జన ఏర్పాట్లు పూర్తి చేశారు. సఫిల్‌గూడ చెరువు వద్ద నిమజ్జనం కోసం ఏర్పాటైన ప్రత్యేక పాండ్‌లో భాగ్యనగర్ గణేష్ ఉత్సవ సమితి విజ్ఞప్తి మేరకు 90 ట్యాంకర్ల ద్వారా మంచినీటిని నింపుతున్నారు. సఫిల్‌గూడ వద్ద రెండు క్రేన్‌లు, బండ చెరువు కొలను వద్ద ఒక క్రేన్ ఏర్పాటు చేశారు. నిరంతరం కరెంటు సరఫరా కోసం పవర్ జనరేటర్లు సమకూర్చారు. విగ్రహాలతో తీసుకువచ్చే పూలు, పూజా సామగ్రిని తొలగించేందుకు శానిటేషన్ సిబ్బంది మూడు షిఫ్ట్‌ల్లో విధులు నిర్వహిస్తున్నారు. 3 నుంచి 7 అడుగుల విగ్రహాలను మాత్రమే రెండు ఘాట్లలో నిమజ్జనానికి అనుమతిస్తున్నారు. గతేడాది సఫిల్‌గూడ చెరువు వద్ద 1,781 విగ్రహాలు, బండచెరువు వద్ద 673 విగ్రహాలు కలిపి 2,454 విగ్రహాలు నిమజ్జనానికి తరలివచ్చాయని నిమజ్జన కార్యక్రమ ఇన్‌చార్జి డిప్యూటీ కమిషనర్ జి.రాజు తెలిపారు.

పెద్ద విగ్రహాలు హుస్సేన్‌సాగర్‌కే...

మల్కాజిగిరి పోలీస్‌స్టేషన్ పరిధిలో తొమ్మిది అడుగుల పైన ఉన్న విగ్రహాలను హుస్సేన్‌సాగర్‌లో నిమజ్జనానికి తరలించాలని సీఐ సత్యనారాయణ మండప నిర్వాహకులకు సూచించారు. మెట్టుగూడ మీదుగా తొమ్మిది అడుగులపైన ఉన్న విగ్రహాలు వెళ్లడానికి బ్రిడ్జి అడ్డుగా ఉంటుందన్నారు. తార్నాక, ఉప్పల్, రామాంతపూర్ మార్గంలో తరలించాలని, ఏ రోజు తరలిస్తారో ముందస్తుగా సమాచారం అందించాలని సూచించారు.

ఆకస్మిక తనిఖీ

నిమజ్జన ఘాట్‌ల వద్ద ఏర్పాట్లను శానిటేషన్ అడిషనల్ కమిషనర్ రఘుప్రసాద్ సర్కిల్ డీసీ రాజుతో కలిసి తనిఖీ చేశారు. సిబ్బంది పనితీరును నిమజ్జనానికి వచ్చే భక్తులను అడిగి తెలుసుకున్నారు. భక్తులకు ఇబ్బంది లేకుండా పరిసరాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఏఎంహెచ్‌ఓ డాక్టర్ మంజుల, శానిటరీ సూపర్ వైజర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో బందోబస్తు: సీపీ

రాచకొండ పోలీసు కమిషనరేట్ పరిధిలో నిమజ్జనం ప్రశాంతంగా జరగడానికి పూర్తిస్థాయిలో బందోబస్తు ఏర్పాటు చేశామని పోలీసు కమిషనర్ సుధీర్‌బాబు తెలిపారు. సఫిల్‌గూడ నిమజ్జన ఘాట్‌ను ఆయన పరిశీలించి సీసీ కెమెరాల ఏర్పాటును పరిశీలించారు. కార్యక్రమంలో డీసీపీ పద్మజారెడ్డి, ఏసీపీ మహేష్, సీఐలు సందీప్, సత్యనారాయణ పాల్గొన్నారు.



ఉత్సవ సమితి సభ్యులతో మాట్లాడుతున్న సీపీ సుధీర్‌బాబు

బుద్ధానగర్‌లో ఘనంగా వినాయక ఉత్సవం



సాక్షి, సిటీబ్యూరో: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బుద్దానగర్ జై శ్రీరామ్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న గణేశ్ నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వాకిటి శ్రీకాంత్‌రెడ్డి-హరిణి దంపతులు పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో బుద్దానగర్ కాలనీవాసులు, జై శ్రీరామ్ యూత్ సభ్యులు సాకేత్ రెడ్డి, సాయి కౌశిక్, శ్రవణ్ రెడ్డి, సాయి పవన్, చరణ్‌రెడ్డి, సాగర్, బన్నీ, సృజిత్ రెడ్డి, విశ్వదీప్, సాయి పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ సెల్ కన్వీనర్‌గా సుధాకర్



రామంతాపూర్: మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా బీజేపీ విశ్వబ్రాహ్మణ సెల్ కన్వీనర్‌గా రామంతాపూర్‌కు చెందిన దర్శనాల సుధాకర్ నియమితులయ్యారు. ఈ మేరకు సోమవారం తెలంగాణ సెల్ కన్వీనర్ పూసల బ్రహ్మచారి నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సుధాకర్ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్, కార్పొరేటర్ బండారు శ్రీవాణి వెంకట్‌రావు, శ్రీనివాస్‌చారిలకు కృతజ్ఞతలు తెలిపారు.

'ప్రజావాణి' ఫిర్యాదులను పరిష్కరించాలి



విజ్ఞప్తులను స్వీకరిస్తున్న డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్పొరేషన్‌లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో పీర్జాదిగూడ డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్ ప్రజల నుంచి ఫిర్యాదులు, వినతి పత్రాలను స్వీకరించారు. మూడు ఫిర్యాదులు అందాయని మున్సిపల్ అధికారులు తెలిపారు. ప్రజావాణి అర్జీలను సత్వరమే పరిష్కరించాలని డిప్యూటీ మేయర్ అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ త్రిలేశ్వర్ రావు, డిప్యూటీ ఇంజనీర్ జి.సాయినాథ్ గౌడ్, రెవెన్యూ అధికారి శ్రీనివాస్ రెడ్డి, టీపీవో సుకన్య తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ నిర్మాణానికి నిధులు అవసరం

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్‌లోని అన్ని కాలనీల్లో డ్రైనేజీ పైపుల నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని కార్పొరేటర్ మేకల సునీతరాముయాదవ్ హెచ్‌ఎండబ్ల్యూఎస్ఎస్‌బీ మేనేజింగ్ డైరెక్టర్ అశోక్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు.

చెత్త పాయింట్ తీసేయాలి

మౌలాలి: చంద్రగిరి కాలనీ రైల్వే అండర్ బ్రిడ్జి వద్ద గతకొన్ని రోజులుగా చెత్త, మట్టి పేరుకుపోయి ఉందని కాలనీవాసులకు కార్పొరేటర్ రాజ్యలక్ష్మీ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే కార్పొరేటర్ అక్కడికి చేరుకుని అధికారులను పిలిచి దగ్గరుండి జేసీబీతో చెత్తను తొలగించే చర్యలు చేపట్టారు. అక్కడ ఉన్న చెత్త పాయింట్‌ను తీసివేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో రాంకీ దయానంద్, సాయి, జవాన్ భాస్కర్,గోపాల్ పాల్గొన్నారు.

నిధులు మంజూరు చేయాలి

గౌతంనగర్: గౌతంనగర్ డివిజన్ పరిధిలోని అన్ని కాలనీలో మౌలిక వసతుల కల్పనకు నిధులు మంజూరు చేయాలని కోరుతూ జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆమ్రపాలిని గౌతంనగర్ డివిజన్ కార్పొరేటర్ మేకల సునీతా రాముయాదవ్ సోమవారం కలిసి వినతిపత్రం అందచేశారు. కమిషనర్ సానుకూలంగా స్పందించినట్లు కార్పొరేటర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో రాముయాదవ్ పాల్గొన్నారు.



ఆమ్రపాలికి వినతిపత్రం అందజేస్తున్న సునీతా రాముయాదవ్

వరద బాధితుల కోసం విరాళాల సేకరణ



గౌతంనగర్‌లో విరాళాల సేకరిస్తున్న మానవసేవే మాధవసేవ గ్రూప్ సభ్యులు

గౌతంనగర్: వరద బాధితుల సహాయార్థం గౌతంనగర్‌లో 'మానవసేవే మాధవసేవ'గ్రూప్ విరాళాలు సేకరిస్తోంది. దాతలు బియ్యం, నిత్యావసర సరకులు అందచేస్తున్నట్లు నిర్వాహకులు కుమ్మరి రాజు తెలిపారు. ఇప్పటివరకు సుమారు 10 క్వింటాళ్ల బియ్యం సేకరించామని, ఈ విరాళాలను ఖమ్మం జిల్లాలోని ముంపు ప్రాంతాల బాధితులకు మంగళవారం అందచేస్తున్నట్లు తెలిపారు.

ఆక్రమణదారులను అరెస్ట్ చేయాలి: బాలమల్లేష్

కాప్రా: చెరువులు, కుంటలు, నాలాలు, పార్క్ స్థలాలను ఆక్రమించినవారిని తక్షణమే అరెస్ట్ చేయాలని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి బాలమల్లేష్ డిమాండ్ చేశారు. సోమవారం ఈసీఐఎల్‌లోని పార్టీ కార్యాలయంలో జరిగిన ఆ పార్టీ మేడ్చల్ జిల్లా కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లను ఆక్రమించి రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు ప్రభుత్వ భూముల్లో బహుళ అంతస్తులు నిర్మించారని మండిపడ్డారు. చెరువు భూముల ఆక్రమణలపై ఉక్కుపాదం మోపుతున్న హైడ్రాను సీపీఐ స్వాగతిస్తుందన్నారు. మేడ్చల్ జిల్లాలోని కాప్రా చెరువు, యాప్రాల్ పరిధిలోని నాగిరెడ్డి చెరువు, బండబాయికుంట, అల్వాల్ చిన్నరాయుడి చెరువు, కుత్బుల్లాపూర్ పరిధిలోని ఫాక్స్ సాగర్, శామీర్‌పేట్ మండల పరిధిలోని మెడిసిటీ ఆస్పత్రి, బొమ్మరాసిపేట చెరువులు ఆక్రమణకు గురయ్యాయని పేర్కొన్నారు. వీటిని హైడ్రా తక్షణమే పరిశీలించి చర్యలు చేపట్టాలని కోరారు. సమావేశంలో సీపీఐ నేతలు దామోదర్‌రెడ్డి, ఉమా మహేష్, దశరథ్, రొయ్యల కృష్ణమూర్తి, ధర్మేంద్ర, రచ్చ కిషన్, శంకర్‌రావు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.



ఈసీఐఎల్‌లోని జిల్లా పార్టీ కార్యాలయంలో సమావేశమైన సీపీఐ నాయకులు

రాష్ట్ర స్థాయి ఖోఖో పోటీలకు వింధ్య ఎంపిక



వింధ్యను అభినందిస్తున్న మేరెడ్డి రవిప్రకాష్

మల్లాపూర్: మల్లాపూర్ మోడ్రన్ హైస్కూల్‌కు చెందిన 8 వతరగతి విద్యార్థిని ఆర్.వింధ్య రాష్ట్ర స్థాయి సబ్ జూనియర్ ఖోఖో పోటీలకు ఎంపికైంది. సోమవారం విద్యార్థిని వింధ్య, కోచ్ నరేంద్రను మోడ్రన్ హైస్కూల్ ఫౌండర్ ముత్యంరెడ్డి, కరస్పాండెంట్ సచీదేవి, హెచ్‌ఎం లక్ష్మీ ప్రసన్న అభినందించారు. క్రీడలపట్ల ఆసక్తి ఉన్న విద్యార్థులను అన్ని విధాలుగా ప్రోత్సహిస్తున్న ఎన్జీవోలు నాగమోహన్, శరత్‌చంద్ర, మేరెడ్డి రవిప్రకాష్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలను పరిష్కరించాలి

అల్వాల్: అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టీచర్లు, సూపర్ వైజర్లు సోమవారం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందచేశారు. అంగన్‌వాడీ టీచర్ల సమావేశానికి శాశ్వత భవన సముదాయాన్ని నిర్మించాలని, అంగన్‌వాడీ కేంద్రాల్లో మెరుగైన మరుగుదొడ్లను ఏర్పాట్లు చేయాలని వినతిపత్రంలో పేర్కొన్నారు. అనంతరం ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అంగన్‌వాడీ కేంద్రాల సమస్యలను పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సీడీపీవో స్వాతి, సూపర్‌వైజర్లు జయశీల, వింధ్యావాహిని, టీచర్లు మీనాక్షి, రాణి, మమత, రాజ్యలక్ష్మీ, శోభారాణి, విజయలక్ష్మీ, సంధ్యా, భాగ్యరేఖ తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డిని కలిసిన అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, టీచర్లు

సమస్యలు పరిష్కరించాలని వినతి

అల్వాల్: అల్వాల్ డివిజన్ పరిధిలో నెలకొన్న ప్రజా సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్పొరేటర్ శాంతిశ్రీనివాస్‌రెడ్డి సోమవారం అల్వాల్ సర్కిల్ కార్యాలయంలోని ప్రజావాణిలో డీసీ శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందచేశారు. అల్వాల్ డివిజన్ పరిధిలో పార్కులు, ప్యాచ్ వర్క్స్, వీధిలైట్లు, పెండింగ్‌లో ఉన్న శ్రీనివాస్‌నగర్ రోడ్డు, పారిశుధ్య సమస్యలు పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మల్లేష్‌గౌడ్, ప్రేమ్, గిరి, సాజిత్ తదితరులు పాల్గొన్నారు.

నకిలీ వైద్యుడు అరెస్టు

ఉప్పల్: నకిలీ వైద్యుడిని ఉప్పల్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకొని రిమాండ్‌కు తరలించారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... పీర్జాదిగూడకు చెందిన కొయ్యలగూడెం బిక్షపతి(40) ల్యాబ్ టెక్నీషియన్. ఉప్పల్ అన్నపూర్ణ కాలనీ హనుమాన్ దేవాలయం వద్ద శ్రీ మణికంఠ పాలీ క్లినిక్ పేరుతో ల్యాబ్ నిర్వహిస్తున్నాడు. ల్యాబ్‌తోపాటు వైద్యం కూడా చేస్తూ వైద్యుడిగా చెలామణి అవుతున్నాడు. సోమవారం ఎస్‌వోటీ పోలీసులు ల్యాబ్‌పై దాడి చేసి నిర్వాహకుడిని అదుపులోకి తీసుకుని ల్యాబ్‌ను సీజ్ చేశారు.

కాళోజీ జయంతి

కాప్రా: తెలంగాణ ప్రజాసాంస్కృతిక కేంద్రం, స్ఫూర్తి గ్రూప్ ఆధ్వర్యంలో సోమవారం ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి నిర్వహించారు. ఈసీఐఎల్ కమలానగర్‌లోని కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో గొడుగు యాదగిరిరావు, శ్రీనివాస్, జయప్రకాష్, కిషన్, వెంకటేశ్వరరావు, జయరాజ్, గౌసియా, శోభ పాల్గొన్నారు.

మేడిపల్లి: పీర్జాదిగూడ మున్సిపల్ కార్యాలయంలో కాళోజీ చిత్రపటానికి మేయర్ అమర్‌సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్‌గౌడ్ పూలమాల వేసి నివాళి అర్పించారు. మున్సిపల్ అధికారులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

హబ్సిగూడ: కాళోజీ జయంతి సందర్భంగా సోమవారం హబ్సిగూడలోని బచ్‌పన్ అకాడమిక్ పబ్లిక్ స్కూల్‌లో తెలంగాణ భాష దినోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థుల పాటలు, ఉపన్యాసాలు, డ్యాన్స్ కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చిలుక శివ్‌కుమార్, కరెస్పాండెంట్ కల్పన, సంధ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



ఈసీఐఎల్ కమలానగర్‌లో కాళోజీ జయంతి



కాళోజీ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న డిప్యూటీ మేయర్ శివకుమార్ గౌడ్

పూజలందుకుంటున్న గణనాథులు

వినాయక చవితి ఉత్సవాలలో భాగంగా ఉప్పల్, మల్కాజిగిర జోన్ల పరిధుల్లో మూడవరోజు సోమవారం వినాయకుడికి భక్తులు అర్చనలు, అభిషేకాలు, హోమాలు చేశారు. గణనాథుని పూజల్లో ఎమ్మెల్యేలు, నాయకులు, కార్పొరేటర్లు, స్థానికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. మండపాల వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పలుచోట్ల నిమజ్జనాలు కూడా నిర్వహించారు.



వాణినగర్ నుండి నిమజ్జనానికి తరలివెళ్తున్న వినాయకుడు



అల్వాల్ రామ్‌నగర్ కాలనీలో వినాయకుని పూజలు



వెంకటాపురంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి, కార్పొరేటర్ శాంతి



కాచవాని సింగారం సుప్రభాత్ టౌన్‌షిప్‌లో సుప్రభాత్ సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో..



కాప్రా శ్రీనివాస ఆఫీసర్స్ కాలనీలోని గణనాథుడికి సరస్వతి పూజా కార్యక్రమం



హెచ్‌బీకాలనీలో ఎమ్మెల్యే లక్ష్మారెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి, కార్పొరేటర్లు ప్రభుదాస్, దేవేందర్‌రెడ్డి



కృష్ణానగర్ కాలనీలో.. వినాయక మండపం వద్ద పూజలు



సాయినగర్ కాలనీలో లక్ష్మీ అంబులెన్స్ అధినేత సునీల్ వర్మ



ప్రత్యేక పూజల్లో పాల్గొన్న కార్పొరేటర్ జంగయ్యయాదవ్



రామంతాపూర్ వార్డు కార్యాలయంలో గణనాథుడికి పూజ



నాచారం శాంతి గార్డెన్స్‌లో గణపతి పూజలో చిన్నారులు

'మహిళా స్వశక్తి' క్యాంటీన్ ప్రారంభం

మల్కాజిగిరి: మహిళా స్వశక్తి పథకం ద్వారా మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన క్యాంటీన్‌ను కార్పొరేటర్ శ్రవణ్, మల్కాజిగిరి సర్కిల్ డీసీ జి.రాజు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళలు స్వయంశక్తితో అభివృద్ధి చెందాలన్న లక్ష్యంతో ఏర్పాటు చేసిన స్వశక్తి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం క్యాంటీన్ నిర్వాహకురాలు రుక్మిణీకి లక్ష రూపాయల చెక్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్ట్ అధికారి మల్లికార్జున్, సీవో లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



చెక్ అందజేసిన కార్పొరేటర్ శ్రవణ్, డీసీ రాజు

గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలు



రవీంద్రభారతి గ్రాండ్ పేరెంట్స్ డేలో పాల్గొన్న తాతలు, నానమ్మలు, అమ్మమ్మలు

కుషాయిగూడ: కుషాయిగూడలోని రవీంద్రభారతి పాఠశాలలో సోమవారం గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులతో కలిసి వారి తాత, నానమ్మ, అమ్మమ్మలు పాఠశాలకు వచ్చి సందడి చేశారు. ఆటలాడుతూ, పాటలు పాడుతూ ఉల్లాసంగా గడిపారు. అనంతరం ప్రిన్సిపాల్ లలిత మాట్లాడుతూ గ్రాండ్ పేరెంట్స్ పట్ల పిల్లలు ఏ విధంగ ఉండాలో తెలియజేశారు.

మేడిపల్లి: బోడుప్పల్ రవీంద్రభారతి పాఠశాలలో గ్రాండ్ పేరెంట్స్ డే వేడుకలను సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు విజయభాను మాట్లాడుతూ పెద్దలను గౌరవించాలని, వారి అనుభవాలు, సలహాలు మన సమాజానికి, దేశానికి ఎంతో అవసరమని అన్నారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించారు.